ఉద్యాన శాఖలో పోస్టులు భర్తీ చేయాలి



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన ఉద్యానవన జేఏసీ నాయకులు



మంత్రిని కలిసిన తూటా అసోసియేషన్ సభ్యులు

ఏజీవర్సిటీ: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన జేఏసీ నాయకులు మంగళవారం కలిశారు. గత 20 సంవత్సరాలుగా ఉద్యాన శాఖలో విస్తరణ అధికారుల నియమకాలు లేవని ఉద్యానశాఖ చదువులు చదవి వృదాగా ఉండాల్సి వస్తుందని త్వరలో ఉద్యాన శాఖ విస్తరణ అధికారులు సంబందిత పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన తూటా అసోసియేషన్

ఏజీవర్సిటీః: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని (తెలంగాణ హర్టికల్చర్ యూనివర్సిటి టీచింగ్ అసోసియేషన్ (తూటా) సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో అనుసరిస్తున్న విద్య, పరిశోధన, విస్తరణల గురించి మంత్రికి వివరించారు. ప్రధానంగా ఉద్యాన విద్యను అభ్యసించిన విద్యార్థుల ఉద్యోగ భద్రతకై తీసుకోవల్సిన విషయాల గురించి వివరించారు. దేశంలోనే మన రాష్ట్రం ఉద్యాన పంటల హబ్‌గా నిలుస్తుందని అన్నారు. దానికనుగుణంగా హర్టికల్చర్ ఆఫీసర్ హెచ్‌ఓ, హెచ్ఈఓ, నియమకాలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో తూటా అధ్యక్షుడు చీనా నాయక్, సురేష్ కుమార్, ప్రశాంత్, లక్ష్మనారాయణ, నిఖిల్, అశ్వనికుమార్, శ్రీనివాసులు తదితరలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అన్ని శాఖల అధికారులు సమన్వాయంతో పని చేస్తు ప్రజలకు అందుబాటులో ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనులకు సంబంధించిన అధికారులతో మాట్లాడుతూ వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని స్థానిక ప్రజల నుంచి అధిక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పాడైన వీధి దీపాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బంది అందరు తమ విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. అలాగే కొత్త వీధిదీపాలు అందించాలని ఈఈఎస్ఎల్ అధికారులకు కోరడమైందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ రాజకుమార్, ఆర్వో నిర్మల, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకం పై శిక్షణ ప్రారంభం



తేనెటటీగల పెంపకంలో నూతన ఆవిష్కరణలను ప్రారంభిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత సకశేరుకాల చీడల యాజమాన్యం ఆధ్వర్యంలో నేషనల బీ కీపింగ్ మరియు హానీ మిషన్లో భాగంగా ఆసక్తి గల యువ రైతులకు తేనెటీగల శిక్షణ ను ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాని రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ తేనెటీగల ప్రాత వాటి సంరక్షణ పై వివరిస్తూ తేనెటీగల పెంపకాన్ని వ్యాపార దృక్పధంతో చేసుకోవడం వల్ల మంచి లాభాలు పొందవచ్చన్నారు. యూనివర్సిటి హెడ్ కీటక విభాగం అధినేత యస్.జె. రహేమాన్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు తేనెటీగాల పెంపకం చేపట్టి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీర్‌కుమార్, డాక్టర్ సునీత, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చినయువ రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ పోస్టర్ అవార్డు పొందిన సీబీఐటీ



అవార్డు సాధించిన అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మణికొండ: ఐఐసీ రీజినల్ మీట్‌లో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల తయారు చేసిన పోస్టర్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఐఏఆర్ఈ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోటీలలో ఈ భహుమతి గెలుచుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి అవార్డును సాధించిన సిబ్బందిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సీవీ. నర్సింహులు అభినందించారు. కళాశాల ఐ అండ్ ఐ సలహాదారుడు ప్రొఫెసర్ యూకే చౌదరి మాట్లాడుతూ భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ దీపన్ కుమార్ సాహు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నామన్నారు. దేశవ్యాప్తంగా 150 విద్యా సంస్థలు పాల్గొనగా అందులో రెండవ స్థానం సీబీఐటీ దక్కించుకుందన్నారు. తమ కళాశాల నుంచి రెండు స్టార్టప్‌లు ప్రదర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.వనిత, ప్రొఫెసర్ రామకృష్ణ, డాక్టర్ అబ్బాస్ ఖాన్, డాక్టర్ అంగ్షుమన్‌దాస్, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు ప్రజలను వేధించడం మానాలి



మహిళలతో మాట్లాడి వారి ఫిర్యాదులు వింటున్న ఎమ్మెల్యే

గోల్కొండ: ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు వినియోగదారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన షేక్‌పేట్, విజయ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలను సందర్శించారు. షేక్‌పేట్ నాలా వద్ద గల మాధవీ ఎల్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. అక్కడ ఉన్న మహిళలు ఆయన వద్దకు వెళ్లి మాధవీ గ్యాస్ ఏజెన్సీ అక్రమాలను, గ్యాస్ రిఫిలింగ్ కోసం ఏజెన్సీ వారు సతాయిస్తున్న తీరును ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాధవి గ్యాస్ ఏజెన్సీపై సుధీర్ఘ కాలం నుంచి ఎన్నో ఫిర్యాదులు ఉన్నాయని అక్రమంగా వీరు గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్‌లో అమ్ముకుంటున్న ఫిర్యాదులు కూడా వచ్చాయన్నారు. కొంత కాలం క్రితమే తాను పౌర సరఫరాల శాఖ అధికారులకు మాధవి గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు మాధవి గ్యాస్ ఏజెన్సీ అక్రమాలను అడ్డుకట్ట వేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పక్కా కమర్షియల్‌గా వ్యవహరిస్తూ మాధవి గ్యాస్ డీలర్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మాధవి గ్యాస్ ఆగడాలపై తాను పౌర సరఫరాల కమిషనర్‌ను కలుస్తానని తన వెంట మాధవి ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులను సైతం తీసుకువెళ్తానని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీల వినియోగదారులకు సరైన సమయంలో గ్యాస్ రిఫిలింగ్ చేయడం లేదని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లీస్ నాయకులు ఆలీముద్దీన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

ప్రమాదపుటంచుల్లో పర్యాటకులు

- గత సంఘటనల నేపథ్యంలో పొంచి ఉన్న ప్రమాదం
- నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న చార్మినార్ సెక్యూరిటీ సిబ్బంది
- పట్టించుకోని ఆర్కియాలజీ అధికార యంత్రాంగం



చార్మినార్‌పై అంతస్తు పిట్టగోడ వద్ద సెల్ఫీలు దిగుతున్న సందర్శకులు (ఫైల్)

చార్మినార్: చార్మినార్ కట్టడం మొదటి అంతస్థులో సందర్శకులు ప్రమాదపుటంచులోకి వెళ్తున్నారు. పిట్టగోడలకు అతి సమీపంలోకి వెళ్లకుండా పర్యాటకులను అడ్డుకోవాల్సిన సెక్యూరిటీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది విధినిర్వహణను పక్కన పెట్టి చార్మినార్ పరిసరాల్లోని బంగారం, వెండి, ముత్యాల ఆభరణాల క్రయవిక్రయాలపై దృష్టి సారిస్తున్నారు. ఆయా ముత్యాల దుకాణాల యజమానుల వద్ద నుంచి వీరికి కమీషన్లు అందుతుండడంతో వారి అడ్రస్‌తో కూడిన విజిటింగ్ కార్డులను సందర్శకులకు అందించి అక్కడికి పంపుతున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదపుటంచులోకి తొంగిచూస్తున్నారు. చార్మినార్ కట్టడంపైన సందర్శకులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. నగర అందాలను తిలకించాలనే ఉత్సాహంలో భద్రతను విస్మరిస్తున్నారు. సెల్ఫీల మోజులో హద్దుమీరుతున్నారు. కట్టడంలోని పైఅంతస్తు పిట్టగోడ వద్దకు వెళ్లకుండా నిరోధించాల్సిన చార్మినార్ కట్టడం సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సందర్శకులను పిట్టగోడ దగ్గరగా వెళ్లకుండా అడ్డుకోవాల్సిన చార్మినార్ కట్టడం సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు సకాలంలో స్పందించకపోవడంతో కొంత మంది సందర్శకులు యథేచ్ఛగా పిట్టగోడ వద్దకు వెళ్లడమే కాకుండా ప్రమాదకరంగా దానిపై కూర్చొని ఫొటోలు దిగుతూ.. కిందికి తొంగి చూస్తున్నారు.

గతంలో చోటు చేసుకున్న ఘటనలు..

- చార్మినార్ కట్టడం పైఅంతస్తు పిట్టగోడ పైనుంచి దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెలు కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరు చార్మినార్ కట్టడం సందర్శన కోసం వచ్చి ఇలా మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటనతో కొన్నేళ్లుగా చార్మినార్ సందర్శనను నిలిపివేశారు.
- తగిన భద్రతా చర్యలు తీసుకున్న అనంతరం తిరిగి సందర్శకులను చార్మినార్ కట్టడంపైకి అనుమతించారు.
- అనుమతించిన అనంతరం కూడా మరో సంఘటన చోటు చేసుకుంది.
- చార్మినార్ కట్టడంపై నుంచి నగర అందాలను వీక్షిస్తున్నట్లు నటించిన ఒక యువకుడు ఆకస్మాత్తుగా తనతో వచ్చిన యువతిని కిందికి తోసేశాడు. దీంతో ఆ యువతి అక్కడికక్కడే మరణించింది.
- మరో సంఘటనలో మతిస్థిమితం కోల్పోయిన ఓ యువకుడు ఆకస్మాత్తుగా లాడ్‌బజార్‌వైపు ఉన్న చార్మినార్ మొదటి అంతస్తు నుంచి కిందికి దూకే ప్రయత్నం చేయగా పోలీసులు రక్షించారు.
- ఇలా ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకునే అవకాశాలున్నందున తగిన ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- చార్మినార్ కట్టడంపైన విధినిర్వహణలో ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేసి వారిపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా బారికేడ్లు..

పిట్టగోడల వద్దకు దగ్గరగా వెళ్లకుండా ఉండేందుకు గతంలో గొలుసులతో కూడిన బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బారికేడ్లను పక్కకు జరుపుతుండటంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీనికి తోడు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని బందో బస్తులో నియమించిన ప్పటికీ.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ పరిస్థితులను చక్క దిద్దాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోటలో కొలువుదీరి ఉన్న జగదాంబిక మహంకాళి అమ్మవారి హుండీని మంగళవారం తెరిచారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో హుండీలో వచ్చిన అమ్మవారి ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. అమ్మవారి హుండీ ఆదాయ వివరాలు పారదర్శకంగా ఉంటాయన్నారు. హుండీ ద్వారా అమ్మవారికి రూ.110180 ఆదాయం వచ్చిందని తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, జగదాంబిక ఆలయ పూజారి సర్వేష్, అమ్మవారి వృత్తిపని వారి సంఘం ప్రతినిధులు తదితరులున్నారు.

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: భర్త వేధింపులు తాళలేక ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ మురాద్‌నగర్‌కు చెందిన షేక్ రసూల్ తనతో వివాహమైన విషయాన్ని దాచిపెట్టి అర్షియాబేగం (23)ను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదిలా ఉండగా మగ సంతనాం కలుగలేదని తరచూ మద్యం తాగి వచ్చి భార్యను హింసించేవాడు. ఇతని వేధింపులు తట్టుకోలేక అర్షియాబేగం ఈనెల 11న అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాములు సాగర్‌కు ఘన నివాళి

గోల్కొండ: ప్రముఖ సంఘ సేవకుడు రాములు సాగర్ సంతాప సభ మంగళవారం గుడిమల్కాపూర్‌లోని వనం ఝాన్సీ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. శివరాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంతాప సభలో రాములుసాగర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జాతీయ నాయకులు బద్దం మహిపాల్‌రెడ్డి, నాయకులు దేవర వంశీ, వాసుదేవ్‌యాదవ్, బోడి అశోక్‌కుమార్ యాదవ్, మురళీకృష్ణగౌడ్, నామ యాదగిరి, సందేష్‌యాదవ్, కెప్టెన్ యాదగిరి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: సంక్రాంతి పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలోన్ని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు యోగా సంగీత నృత్య గురువులు, కవులు, రచయితలకు సంక్రాంతి పురస్కారాలు అందజేయనున్నట్లు సర్వేజన సుఖినోబవంతు సంస్థ అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ మాస్టార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి వారి సేవలను గుర్తించి సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం



నర్సింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న బంగారు కుమార్

శంషాబాద్ రూరల్: మండలంలోని బహదూర్‌గూడకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో సొసైటీ డైరెక్టర్ జీవన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కస్తూరి నరేందర్ సమక్షంలో పార్టీ తీర్థం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తుందని, రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బంగారు కుమార్, దశరథ, పాండు, మల్లేష్, షఫీక్, ఆంజనేయులుగౌడ్, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నరేందర్, ఉపసర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ జంగయ్య, పరమేష్, అంజయ్య, కృపాకర్, సురేందర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలులో వేగంపెంచాలి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: ఆస్తి పన్ను వసూళ్లను పెంచాలని వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లపై శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెస్ట్ జోనల్ పరిధిలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల నుంచే ఆస్తి పన్ను వసూళ్ల సింహభాగం ఉంటాయన్నారు. మీకు నిర్దేశించిన టార్గెట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీ ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ అసెస్‌మెంట్లలో ఇబ్బందులు ఉన్నాయని, ఫోన్ నంబర్లు లేకపోవడంతో కొన్ని దరఖాస్తులలో ఫోన్ నెంబర్లు ఉండటం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు రజనీకాంత్ రెడ్డి, వంశీకృష్ణ, ఏఎంసీలు నరేందర్ రెడ్డి, దీపక్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవెందర్, ప్రేమ్ కుమార్, శ్రావణ్‌రెడ్డి, టీఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో బాక్సింగ్‌పై పెరుగుతున్న ఆదరణ



పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి

గోల్కొండ: మహిళల్లో బాక్సింగ్‌పై ఆదరణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఇండియన్ రైల్వే బోర్డు సభ్యురాలు ఉమారాణి అన్నారు. షేక్‌పేట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 7వ ఎలైట్ మహిళా రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లు జరిగాయి. ఈ పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పదేళ్లుగా బాక్సింగ్ రంగంలో మహిళలు ఎందరో దూసుకువచ్చారన్నారు. ఈ టోర్నమెంట్ విజేతలకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు జరిగే జాతీయ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, నవభారత్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వినయ్, వనిత అన్నారు. వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బాబురావు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మహేష్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్, ప్రముఖ బాక్సర్ నికత్ జరీన్ తండ్రి జమీల్, బీజేపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

గోల్కొండ: అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. తెలంగాణలో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఈ విషయాన్ని బల్దియా, వైద్య శాఖ అధికారులతో పాటు జలమండలి అధికారులు కూడా గుర్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. కొత్త పథకాల అమలు, వాటి ప్రారంభోత్సవం వివరాలను కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జిగా ఉన్న తనను ఇప్పటి వరకు ఏ అధికారికి కూడా స్పందించలేదని ఆయన అన్నారు. నియోజవర్గానికి మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారని ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్వాన్ ఇన్‌చార్జితో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులను సైతం ఆహ్వానించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితి పది లక్షలకు పెంచిన కార్యక్రమాన్ని ఆదివారం అధికారులు ప్రారంభించారని ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యశాఖ మంత్రికి సన్మానం



వైద్యశాఖ మంత్రి రాజనర్సింహాను సన్మానించిన జల్లపల్లి నరేందర్, తదితరులు

శంషాబాద్: రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. వైద్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరారు.

కాంతారెడ్డికి ఘనంగా నివాళి

అత్తాపూర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత నేత కొండకళ్ల కాంతారెడ్డి సేవలు పార్టీకి తీరనిలోటని ఆయన 5వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంగళవారం గోవర్ధన్ రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్న కాంతా రెడ్డి జిల్లాలో పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం చంద్రశేఖర్‌రావును ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

మనూ-మై చాయిస్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్, మై చాయిస్ ఫౌండేషన్‌ల మధ్య అవగాహన ఒప్పందాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ ఫర్హానా ఖాన్, ఆపరేషన్స్ హెడ్, డాక్టర్ అనితాసేబుల్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గుల్ఫిషా న్‌హబీబ్ ,మహిళా విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ ,ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారి దర్శనానికి ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కె.వెంకటేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ గొప్పతనాన్ని..అమ్మవారి మహత్యాన్ని మంత్రికి వివరించారు.

'ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుంది'



ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల ఆరు హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మెహిదీపట్నం, ఆసీఫ్‌నగర్ చౌరస్తా, మాసాబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా బస్టాప్‌ల వద్ద మహిళా ప్రయాణికులను కలుసుకున్నారు. మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం కల్పించడంపై ఆయన మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు నిశ్చింతగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, జి.కిషన్, హబీబ్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సుల్తాన్‌బజార్: చరిత్ర పురాతన అంశాలు, మన పూర్వీకుల జీవన విధానంపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించేందుకు ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ నిర్వాహకులు హైపెక్స్ డైమండ్-2023 పేరిట ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాస్‌రాజు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1961లో ఏర్పడిన తమ సంస్థ ఇప్పటి వరకు వందల కొద్దీ ప్రదర్శనలు నిర్వహించిందని వివరించారు. పాత నాణేలు, స్టాంపులను సేకరించే అభిరుచి కలిగిన ఎంతోమందిని ఒక వేదిక మీదకు తీసుకువచ్చేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాణేల సేకరణ అభిరుచి కలిగిన వ్యక్తులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో వందల ఏళ్ల నాటి నాణేలు, స్టాంపులను వీక్షించడమే కాకుండా ఆసక్తి ఉన్నవారు కొనుగోలు చేయవచ్చన్నారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్ నాంపల్లి రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సిభవన్‌లో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

మీరాలంమండిలో ప్రత్యేక పూజలు



చార్మినార్: కార్తీక మాసం చివరి రోజైన అమావాస్యను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా గణపతి అభిషేకం, గణపతి గరిక సహస్ర నామ అర్చన, అమ్మవారికి అభిషేకం, శ్రీ చక్ర అర్చన అనంతరం చండీహోమం జరిగింది. ఈ హోమం కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య-చంద్రకళ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని గాజుల అంజయ్య తెలిపారు.